హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 70

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.107	187	213
సూర్యాపేట	రూ.95	140	160
నల్లగొండ	రూ.107	187	213

ఉష్ణోగ్రత గరిష్ఠం 30.0 । కనిష్ఠం 18.0

ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికల సందడి మొదలు కానుంది. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ బడుల్లో పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ)లకు ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సాధారణ పాఠశాలల తోపాటు కేజీబీవీలు, మోడల్‌స్కూళ్లు తదితర పాఠశాలల్లో కొత్త కమిటీలను ఈ నెల 29న ఎన్నుకోనున్నారు. ఇందుకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఉత్తర్వులు జారీచేశారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ), భువనగిరి టౌన్, భానుపురి)



» ఎస్ఎంసీ ఎన్నికలకు సన్నాహాలు
» నేడు నోటిఫికేషన్ జారీ
» 29న చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులకు ఎన్నికలు

ప్రభుత్వ పాఠశాలల్లో.. ఎన్నికల సందడి



ఉమ్మడి జిల్లాలోని నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల్లో 2019, డిసెంబర్‌లో విద్యాకమిటీలను ఎన్నుకున్నారు. ఆ తర్వాత పాత కమిటీల పదవీకాలాన్ని ఆరు నెలల చొప్పున పొడిగిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో నాలుగేళ్ల తర్వాత కొత్త కమిటీలను ఎన్నుకునేందుకు ఎన్నికలు నిర్వహించడానికి నిర్ణయించారు. ఎస్ఎంసీ ఎన్నికల్లో ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని సభ్యులు, చైర్మన్, వైస్‌చైర్మన్‌ను ఎన్నుకుంటారు. విద్యార్థుల తల్లిదండ్రులు చేతులెత్తే విధానం ద్వారా ఈ ఎన్నికలు జరుగుతాయి. కొత్తగా ఎన్నికైన కమిటీల పదవీకాలం రెండేళ్లపాటు ఉంటుంది. ఈ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 20వ తేదీన నోటిఫికేషన్ జారీ చేయడంతోపాటు విద్యార్థుల తల్లిదండ్రుల జాబితాను నోటీస్ బోర్డులో ప్రదర్శిస్తారు. 22వ తేదీన తల్లిదండ్రుల జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తారు. 24న తల్లిదండ్రుల తుది జాబితాను వెల్లడిస్తారు. 29న ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సభ్యుల ఎన్నిక, మధ్యాహ్నం ఒకటిన్నర గంటలకు సభ్యులతోపాటు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలను నిర్వహించి అదే రోజు 2గంటల నుంచి 4గంటల వరకు తొలి విద్యాకమిటీ సమావేశాన్ని నిర్వహించనున్నారు.

పాఠశాల యాజమాన్య కమిటీల విధులు

- ఎస్ఎంసీలు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తే పాఠశాలల్లో మౌలిక వసతులు సమకూరడంతోపాటు విద్యా ప్రమాణాలు పెరిగి అంతిమంగా విద్యార్థులకు లాభం చేకూరుతుంది.
- పాఠశాలల నిర్వహణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించాలి.
- మధ్యాహ్న భోజనం, పాఠశాల నిధుల వినియోగం, స్వాతంత్ర్య దినోత్సవం, తదితర ప్రత్యేక దినాల నిర్వహణను పర్యవేక్షించాలి.
- విద్యార్థులను చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక, పరిశోధనలు తదితర అంశాల్లో ప్రోత్సహించేందుకు అవసరమైన సహకారం అందించాలి.
- పాఠశాలల్లో పరిశుభ్రత, తాగునీరు, సరిపడా తరగతి గదులు, వసతుల కల్పనకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించాలి.
- స్థానిక దాతల నుంచి విరాళాలు సమకూర్చడంపై కూడా శ్రద్ధచూపాలి.
- తల్లిదండ్రులు, ఇతర సమావేశాలకు విధిగా హాజరయ్యేలా చూడాలి. ఉపాధ్యాయులతో సఖ్యతగా పని చేయాలి.

చేయకూడనివి..

- స్కూల్ గ్రాంట్స్ వినియోగంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో ఎస్ఎంసీ చైర్మన్‌కు జాయింట్ చెక్ పవర్ ఉంటుంది.
- నిధుల వినియోగంపై ప్రధానోపాధ్యాయుడితో కలిసి పనిచేయాలి. అంతేగానీ వ్యక్తిగత లాభాపేక్షతో చెక్‌పై సంతకాన్ని ఆసరాగా తీసుకొని ఇబ్బంది పెట్టవద్దు.
- ఉపాధ్యాయులపట్ల అమర్యాదగా వ్యవహరించకూడదు.
- ఉపాధ్యాయుల అటెండెన్స్ రిజిస్టార్, హాజరుపై అనుమానాలు ఉంటే అధికారులకు ఫిర్యాదు చేయాలి. నేరుగా చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరికలు జారీ చేయవద్దు.
- కమిటీని బాధ్యతగా మాత్రమే పరిగణించాలి, కానీ అధికారంగా వ్యక్తిగత హోదాగా పరిగణించరాదు.
- సొంత పిల్లల మార్కులు, హాజరు, తదితర ప్రయోజనాల కోసం ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన సిబ్బందిపై ఒత్తిడి తేవద్దు.
- అంతిమంగా పాఠశాల ప్రతిష్టకు భంగం కలిగించ వద్దు.

జిల్లాల వారీగా పాఠశాలల వివరాలు

జిల్లా	ప్రాథమిక	ప్రాథమికోన్నత	ఉన్నత	కేజీబీవీ	మోడల్	ఉర్దూ
నల్లగొండ	1126	126	229	27	17	1
సూర్యాపేట	690	78	182	18	9	1
యాదాద్రి	481	68	163	11	7	1

పాఠశాలల బలోపేతంపై దృష్టి

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు దృష్టిసారించింది. నాలుగేళ్లుగా పాఠశాలలకు కమిటీలు లేకపోవడంతో జవాబుదారీతనం లేకుండా పోయిందన్న చర్చ సాగింది. ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీల మధ్య సమన్వయం చేయడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందించడంకోసం ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలేని ఊరు ఉండవద్దని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. త్వరలోనే మెగా డీఎస్సీ వేయడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా లేకుండా చూడనున్నారు. దీంతోపాటు నిర్దేశించిన విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఉండేలా ఉపాధ్యాయులతోపాటు కమిటీలు కూడా కృషి చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలలకు ప్రైవేట్ పాఠశాలలతో పోటీ ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపర్చి విద్యార్థులను ఆకర్షించనున్నారు. గత ప్రభుత్వం మన ఊరు-మనబడి పేరుతో పాఠశాలలకు నిధులు కేటాయించిన సంగతి తెలిసిందే. అయితే మొదటి విడత ఇంకా పనులు పూర్తికాలేదు. మౌలిక సదుపాయాలు కల్పిస్తే పాఠశాల స్థితిగతులు మెరుగుపడనున్నాయి. ఆయా పాఠశాలల్లో నీటి సౌకర్యంతోపాటు మరుగుదొడ్లు, విద్యుద్ధీకరణ, తాగునీటి సరఫరా తదితర సౌకర్యాలు కల్పించనున్నారు. ఈ సౌకర్యాలు కల్పించడంతోపాటు పాఠశాలల్లో కమిటీలు ఏర్పాటు చేస్తే ఉపాధ్యాయులు, కమిటీల భాగస్వామ్యంతో గణనీయంగా పాఠశాలల్లో మార్పులు వస్తాయని భావిస్తున్నారు. నల్లగొండ జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 1,54,301మంది విద్యార్థులుండగా, యాదాద్రి భువనగిరి జిల్లాలో 1,27,633మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో 1,36,855 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు.

విద్యా కమిటీ ఎన్నికలకు ఏర్పాట్లు



ప్రభుత్వ ఆదేశాలమేరకు పాఠశాల విద్యా కమిటీల ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశాం. 20వ తేదీన నోటిఫికేషన్ జారీ చేయనుండగా ఈ నెల 29తో ఎన్నికల ప్రక్రియ ముగియనుంది. 1వ తరగతి నుంచి 8వ తరగతి చదివే విద్యార్థుల తల్లిదండ్రులు చేతులెత్తే విధానం ఈ ఎన్నికలో నిర్వహిస్తాం. ప్రతీ తరగతి నుంచి ముగ్గురు సభ్యుల చొప్పున అన్ని తరగతులకు ఎన్నిక కాబడిన వారిలో ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్‌చైర్మన్ ఎన్నుకుంటారు.

- బొల్లారం భిక్షపతి, జిల్లా విద్యాశాఖ అధికారి, నల్లగొండ

నేటి నుంచి ఎన్నికల ప్రక్రియ

ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల ప్రక్రియ నేటినుంచి ప్రారంభంకానుంది. కమిటీ కాల పరిమితి రెండేళ్లు, కమిటీలోని సభ్యుల పిల్లలు ఆ లోపు పాఠశాలను వీడితే తల్లిదండ్రుల కమిటీ సభ్యత్వం రద్దవుతుంది. వారిస్థానంలో నూతన సభ్యులకు అవకాశం కల్పిస్తారు. చేతులెత్తే, అభిప్రాయ సేకరణ విధానంలో అవసరమైతే బ్యాలెట్ విధానంలో ఎన్నికలు నిర్వహిస్తారు. ఎన్నికల కమిటీ కన్వీనర్‌గా ప్రధానోపాధ్యాయుడు వ్యవహరిస్తారు. ఈ మేరకు ఈ నెల 20న నిర్వహించే తల్లిదండ్రుల సమావేశంలో ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటిస్తారు. అయితే తప్పనిసరిగా ఆ సమావేశానికి 50శాతం తల్లిదండ్రులు హాజరు కావాల్సిఉంటుంది. తల్లిదండ్రుల్లో ఒకరికి మాత్ర మే ఓటు హక్కు ఉంటుంది. తల్లిదండ్రులు లేని పిల్లల సంరక్షకులు కూడా ఓటర్లే.

షెడ్యూల్ ఇలా


- 20వ తేదీన తల్లిదండ్రుల సమావేశం. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల.
- 22, 23వ తేదీ వరకు ముసాయిదా జాబితాపై అభ్యంతరాల స్వీకరణ.
- 23న అభ్యంతరాల పరిశీలన.
- 24న తుది ఓటరు జాబితా ప్రకటన.
- 29న ఎస్ఎంసీ ఎన్నికలు, ఫలితాల ప్రకటన, తొలి సమావేశం నిర్వాహణ.

యాజమాన్య కమిటీలు ఇలా..

- ఒకటి నుంచి 8వ తరగతి పిల్లల తల్లిదండ్రులకు మాత్రమే ఎస్ఎంసీ కమిటీలకు అర్హులు.
- పిల్లల తల్లి లేదా తండ్రి లేదా సంరక్షకులలో ఒకరు మాత్రమే కమిటీకి ఎన్నికవుతారు.
- ప్రతీతరగతి నుంచి ముగ్గురు సభ్యులను ఎన్నుకోవాలి.
- వీరిలో ఒకరు ఎస్సీ, ఎస్టీ, అనాథ, హెచ్ఐవీ తదితర వర్గాల కుటుంబాలకు చెందిన కుటుంబాల పిల్లలకు చెందిన తల్లిదండ్రులు, బలహీన, మైనార్టీ వర్గాల నుంచి ఒకరు, జనరల్ (కులమతాలకు సంబంధం లేకుండా)నుంచి ఒకరు ఉండాలి.
- ఈ ముగ్గురిలో తప్పనిసరిగా ఇద్దరు మహిళలుండాలి.
- ఎన్నికైన సభ్యులు చైర్మన్, వైస్‌చైర్మన్‌ను ఎన్నుకుంటారు. వీరిరువురిలో ఒకరు మహిళ తప్పనిసరి.
- ఎన్నికైన మిగతావారు కమిటీ సభ్యులుగా కొనసాగుతారు.
- ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా ఉంటారు. అలాగే ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో నామినేట్ చేసిన ఉపాధ్యాయుడు (మహిళా ఉపాధ్యాయులకు తొలి ప్రాధాన్యం) ఉంటారు.
- పాఠశాల ఏ పరిధిలో ఉంటే ఆ వార్డు సభ్యుడు, పాఠశాల ఆవాస ప్రాంతంలోని అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్ఎం, స్థానిక మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి ఒకరు ఉంటారు.

భూ మాయ

తక్కువ ధరలకే ఎన్నెస్పీ భూములు
అనుయాయులకు అప్పగిస్తున్న నేతలు
నామమాత్రపు ధరకే ఐదు ఎకరాల స్థలం లీజు



రాజుల సొమ్ము రాళ్లపాలు.. ప్రభుత్వ భూములు పెద్దల పాలు అన్నచందంగా తయారైంది. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో ఎన్నెస్పీ భూములపై అక్రమార్కుల కన్నుపడింది. రూ.కోట్లాది విలువైన భూములను తమ అనుయాయులకు నామమాత్రపు ధరకే అప్పనంగా అప్పగిస్తున్నారు. ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో అవసరాల కోసం నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో సేకరించిన రూ.కోట్ల విలువ చేసే భూమిని జీవో నెం.58, 59 కింద ఖమ్మంలో గత అధికార పార్టీ నేతలు మింగేశారు. ప్రస్తుతం తాగునీటి అవసరాల కోసం సాగర్ హిల్‌కాలనీలో నిర్మించిన ఫిల్టర్ హౌస్‌కు సంబంధించి ఐదు ఎకరాల స్థలాన్ని తక్కువ ధరకు లీజుకిచ్చేశారు. ఇదేమని అధికారిని ప్రశ్నించగా, అక్కడ ఫిల్టర్ హౌస్ ఉన్నట్లు తనకు తెలియదని సమాధానమిస్తున్నారు.

● నాగార్జునసాగర్

అక్రమ ప్లాట్ల దందా!

నకిలీ సర్టిఫికెట్లు సృష్టించిన దళారులు
అమాయకులకు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్న వైనం
నార్కట్‌పల్లి మండలంలో చర్చనీయాంశం



నకిలీకి కాదేదీ అనర్హం అన్న రీతిలో నార్కట్‌పల్లిలో ప్లాట్ల దందా కొనసాగుతోంది. రెవెన్యూయ కార్యాలయమే జారీ చేసినట్లు తప్పుడు సర్టిఫికెట్లు సృష్టించి ప్రభుత్వ భూమిలోని ప్లాట్లను అమాయకులకు అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ తంతంగం నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని బలహీన వర్గాల గృహాల కాలనీలో మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది. ఈ దందాపై మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు గగ్గోలు పెట్టినా పట్టించుకునే దాఖలాలే లేవన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● నార్కట్‌పల్లి

నిబంధనలకు తూట్లు

నాడు రోడ్డు కోసం వదిలేశారు..
నేడు ఆ రోడ్డునే మింగేసి నిర్మాణాలు చేపడుతున్నారు
చౌటుప్పల్ మునిసిపాలిటీ పరిధిలో రియల్ దందా

చౌటుప్పల్ పట్టణంలోని వలిగొండ రోడ్‌లో 2017లో 66 ఎకరాల్లో వెంచర్ నిర్మించారు. అప్పట్లో వెంచర్‌కు రోడ్డుగా చూపి, ప్రస్తుతం నిర్మాణాలు చేపడుతున్నారు. హెచ్ఎండీఏ నిబంధనల ప్రకారం రిజిస్ట్రార్ తనిఖీ చేసి, రిజిస్ట్రేషన్ చేయాలి. కానీ అవేమీ పట్టించుకోకపోవడంతో సదరు వెంచర్‌లో అక్రమ నిర్మాణాలు నిర్వాహకులకు లాభాలు తెచ్చిపెడుతుండగా, అక్కడ ఇళ్లు నిర్మించుకొని నివాసముంటున్న వారికి ఇబ్బందులు తెస్తున్నాయి. రోడ్డును ఆక్రమించి ఇంటి నిర్మాణానికి పిల్లర్ గుంతలు తీసి పనులు చేస్తున్నా మునిసిపల్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వెంచర్ నిర్మాణాలకు హెచ్ఎండీఏ అనుమతులు తప్పని సరి చేసినా రియల్ వ్యాపారుల ఆక్రమణలు తప్పడం లేదు.

● చౌటుప్పల్ మునిసిపాలిటీ 7

అధికారులు సమన్వయంతో పని చేయాలి

కలెక్టర్ హరిచందన దాసరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన దాసరి

నల్లగొండ టౌన్, జనవరి 19: గ్రామీణ ప్రాంతాల్లో ఇరిగేషన్, మిషన్ భగీరథ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశమందిరంలో మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ పనులను పూర్తి చేయాలని తెలిపారు. మిషన్ భగీరథ శాఖ కార్యకలాపాలు, పథకాల అమలు గురించి ఇంజనీరింగ్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో చీఫ్ ఇంజనీర్లు చెన్నారెడ్డి, లలిత, ఎస్ఈలు వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పాపారావు, వంశీ కృష్ణ, లక్ష్మీనారాయణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరం

ఓటరు నమోదుకు ఈ నెల 20, 21 తేదీలలో ప్రత్యేక శిబిరాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఇతర ఎన్నికల అధికారులతో కలిసి ఓటర్ నమోదు, పార్లమెంటు ఎన్నికల సన్నద్ధతపై జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండి ఓటరుగా నమోదు కానివారు ఓటరు జాబితాలో పేరు నమోదుకు, చిరునామా తదితర సవరణల గురించి జిల్లాలో రెండు రోజులపాటు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ రెండు రోజులపాటు బూతులెవల్ అధికారులంతా సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో ముసాయిదా ఓటర్ జాబితా, సంబంధిత ఫాం 6, ఫా 8లతో ఉదయం10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఓటరు నమోదుకు, ఒక పోలింగ్ కేంద్రంనుంచి మరో పోలింగ్ కేంద్రానికి మార్పు, సవరణలు, ఇతర అభ్యంతరాలపై దరఖాస్తులు స్వీకరిస్తారని చెప్పారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, ఆర్డీవోలు రవి, శ్రీరాములు, దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది

కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్‌పాండే

పెద్దవూర, జనవరి 19: తెలంగాణ అభివృద్ధికి నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్‌పాండే అన్నారు. మండల పరిధిలోని పులిచర్ల గ్రామంలో ఎస్‌బీఐ బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన ఈ అమృత్ మహోత్సవం సందర్భంగా గత నవంబరు 15న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని ప్రధానమంత్రి మోదీ ప్రారంభించారన్నారు. దేశంలోని 6.50లక్షల గ్రామాల్లో ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. ఈ యాత్రలో భాగంగా వికసిత వాహనం గ్రామానికి వచ్చినప్పుడు అన్ని శాఖల అధికారులు కూడా దాంతోపాటే ఉంటారని, గ్రామీణుల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తారన్నారు. ఇందులో భాగంగా రైతులకు వ్యవసాయ రుణాలు, గ్యాస్ లేనివారికి సిలిండర్లు, ముద్రా లోన్లు తదితర పథకాలను అందజేస్తారన్నారు. మహిళా సమాఖ్యలకు ప్రతీ గ్రామంలో మందులను పిచికారీ చేసేందుకు డ్రోన్‌ను ఇవ్వనున్నట్లు తెలిపారు. రాబోయే 15 రోజుల్లో దేశంలోని మిగతా గ్రామాల్లో వ్యాన్ పర్యటిస్తుందన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తెలంగాణకు ఎయిమ్స్‌ను కేటాయించిందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ హేమంత్ కేశవపాటిల్, బీజేపీ నాయకులు కంకణాల శ్రీధర్‌రెడ్డి, నివేదితరెడ్డి, ఎస్‌బీఐ బ్యాంక్ డీజీఎం ప్రశాంత్ బరియార్, ఏజీఎం అలీమొద్దీన్, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రామిక్, డీఆర్‌డీఏ పీడీ కాళిందిని, ఆర్డీవో చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి

ఈ నెల 22న అయోధ్యలోని శ్రీరామ ఆలయం ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపుమేరకు పులిచర్ల గ్రామంలో పర్యటించిన కేంద్ర మంత్రి మహేంద్రనాథ్‌పాండే గ్రామంలోని రామాలయంలో స్వచ్ఛ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన రామాలయంలో శుద్ధి కార్యక్రమం నిర్వహించి అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం కేంద్ర మంత్రికి గ్రామస్థులు బోనాలు, బతుకమ్మలు, డప్పుచప్పుళ్లతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కంకణాల నివేదితరెడ్డి, ముత్యంరెడ్డి, వెంకటయ్య, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, ఖమ్మంపాటి కృష్ణ, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పులిచర్ల రామాలయంలో స్వచ్ఛ అభియాన్‌లో భాగంగా శుభ్రం చేస్తున్న కేంద్ర మంత్రి మహేంద్రనాథ్‌పాండే

దొంగతనాల నియంత్రణకు ప్రత్యేక బృందాలు

● ఎస్పీ చందనా దీప్తి



నల్లగొండ టౌన్, జనవరి 19: జిల్లాలో దొంగతనాల నియంత్రణకు పోలీస్ యంత్రాంగం ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసిందని ఎస్పీ చందనా దీప్తి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు ఇంటి పరిసరాలు, కాలనీలు, షాపుల్లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని, ఏదైనా సంఘటన జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. జైలు నుంచి విడుదలయిన నిందితుల కదలికలపై జేఆర్ఎంఎస్ (జైల్ రిలీజింగ్ మానిటరీ సిస్టమ్) ద్వారా నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దొంగతనాల నియంత్రణకు పోలీసుల సూచనలు పాటించాలన్నారు. విలువైన వస్తువులు, బంగారం, నగదు బ్యాంక్ లాకర్‌లో భద్రపరుచుకోవాలన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు ముందుగానే తెలియజేస్తే అక్కడ పోలీస్ వారు నిఘా ఏర్పాటు చేస్తారన్నారు. అపరిచిత వ్యక్తులు కన్పిస్తే 100కు డయల్ చేయాలన్నారు.

సీఎంఆర్ సేకరణను వేగవంతం చేయాలి

జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు

చింతపల్లి, జనవరి 19: ప్రభుత్వం రైతులనుంచి కొనుగోలు చేసి రైస్ మిల్లర్లకు అప్పగించిన ధాన్యానికి సంబంధించి సీఎంఆర్ ఇచ్చే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు.

శుక్రవారం సాయంత్రం మండలంలోని నసర్లపల్లి వెంకటసాయి రైస్ ఇండస్ట్రీస్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ పెండింగ్‌కు గల కారణాలు, సేకరణ ప్రక్రియ ఆలస్యం గురించి రైస్ మిల్లు యజమానిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం విధించిన గడువులోగా సీఎంఆర్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనవెంట పౌరసరఫరాలశాఖ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎండీ అబీబ్ తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఫలితాలను సాధించాలి: డీఈవో భిక్షపతి



విద్యార్థి సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈవో

కనగల్, జనవరి 19: విద్యార్థులకు ప్రణాళికాబద్ధంగా అదనపు తరగతులు నిర్వహించి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో భిక్షపతి ఆదేశించారు. శుక్రవారం మండలంలోని దోరేపల్లి, పగడిమర్రి, జీఎడవల్లి ప్రభుత్వ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. తరగతుల వారీగా విద్యార్థుల ప్రతిభా పాటవాలను తెలుసుకున్నారు. పగిడిమర్రి పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. జీఎడవల్లి పాఠశాలలో మధ్యాహ్న వంటలను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. కాగా పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల్లో ఉపాధ్యాయులు సమయపాలనను ఖచ్చితంగా పాటించాలన్నారు. ఆయనవెంట హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆస్తిపన్ను వసూళ్లపై దృష్టి సారించాలి

మునిసిపల్ కమిషనర్ రవి



సమావేశంలో మాట్లాడుతున్న రవి

రామగిరి, జనవరి 19: ఆస్తి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని మునిసిపల్ కమిషనర్ ఎస్.రవి ఆదేశించారు. నల్లగొండ ఆర్డీవో రవికి మునిసిపల్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించి, శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఆస్తిపన్ను వందకు వందశాతం వసూలయ్యేలా చూడాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇంజనీరింగ్ శాఖ పరిధిలో జరుగుతున్న రోడ్లు ఇతర పనులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాములు, ఏసీపీ నాగిరెడ్డి, రెవెన్యూ అధికారి ఆరిఫుద్దీన్, పవన్ కుమార్, డీఈలు వెంకన్న, అశోక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సురిగి శంకర్, గడ్డం శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి బలవన్మరణం

చౌటుప్పల్ రూరల్, జనవరి 19: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వివిధ కారణాలతో ముగ్గురు బలవన్మరణానికి పాల్పడ్డారు.యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామంలో వివాహం కావడం లేదనే మనస్తాపంతో ఓ చేనేత కార్మికుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. సీఐ దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొయ్యలగూడెంకు చెందిన గుగ్గుళ్ల కొండయ్య, సౌభాగ్య దంపతులు చేనేత కార్మికులుగా జీవనం సాగిస్తున్నారు. ఇద్దరు కుమారులు, కుమార్తె కాగా ఆమెకు వివాహం చేశారు. పెద్ద కుమారుడు నరేష్(32) డిగ్రీ పూర్తిచేసి చేనేత కార్మికుడిగా, చిన్న కుమారుడు కుట్టుమిషన్ ద్వారా ఉపాధి పొందుతూ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటున్నారు. ఏడాది క్రితం ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేసిన నరేష్ నాలుగు నెలల క్రితం మరో కంపెనీలో చేరాడు. నెల క్రితం కరోనా పాజిటివ్ రావటంతో ఉద్యోగానికి వెళ్లడం లేదు. కరోనా పాజిటివ్ నుంచి కోలుకుని సాధారణ స్థితికి చేరుకుని ఇంట్లోనే చేనేత పనులు చేస్తున్నాడు. వయస్సు పెరుగుతున్నా వివాహం కావడంలేదని కొంతకాలంగా కుటుంబసభ్యుల వద్ద నరేష్ ఆవేదన వ్యక్తంచేసేవాడు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో నరేష్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసు సిబ్బంది మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో..

ఆత్మకూర్(ఎస్) : సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలంలో ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పాతర్లపహాడ్ క్రాస్‌రోడ్డులోని విజయనగర్ కాలనీకి చెందిన రావుల చిన్నవీరయ్య(45) పాత ఇనుపసామాను వ్యాపారం చేస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. మానసికంగా కుంగి గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపాస్మరక స్థితిలో ఉండగా, గమనించిన స్థానికులు సూర్యాపేట జనరల్ ఆసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారు. చిన్నవీరయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య నాగమణి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా ఆర్థిక ఇబ్బందులతో చిన్నవీరయ్య ఆత్మహత్య చేసుకోవడంతో ఆయన కుటుంబ సభ్యులకు హెల్త్ సూపర్‌వైజర్ రంగమ్మ, ఎన్ఎం విజయశ్రీ, ఆశ కార్యకర్త రమ్యలు రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు.

కుటుంబ సమస్యలతో..

నార్కట్‌పల్లి : కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురై ఓ యువకుడు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని దాసరిగూడెం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ నర్సిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మండలం పానగల్ నందీశ్వర కాలనీకి చెందిన అమరోజు శివ (34) ఈ నెల 18వ తేదీన నార్కట్‌పల్లి మండలంలోని దాసరిగూడెంలో ఉండే తన స్నేహితుడు కొమ్మనబోయిన సైదులు ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సమస్యలే కారణమని తెలుస్తోంది. మృతుని భార్య అమరోజు కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వివరించారు.

భూ మాయ



సాగర్ హిల్‌కాలనీలో నిర్మించిన ఫిల్టర్ హౌజ్

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో భూమాయ కొనసాగుతోంది. రోజు రోజుకు భూముల ధరలకు పెరుగుతుండటంతో ఆక్రమిస్తున్నారు. నకిలీ పత్రాలు సృష్టించి ప్లాట్లను విక్రయిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం, అక్రమాల కారణంగా ఒక్కో చోట ఒక్కో రకంగా భూములను కబ్జా చేస్తున్నారు. దీంతో కోట్లాది రూపాయల భూములు మాయమవుతున్నాయి.

- కోట్ల విలువైన ఎన్నెస్పీ భూములు ప్రైవేటు సంస్థలకు ధారాదత్తం
- హిల్‌కాలనీకి నీటి సరఫరా కోసం నిర్మించిన ఫిల్టర్ హౌజ్ స్థలం లీజుకు
- నార్కట్‌పల్లిలో నకిలీ సర్టిఫికెట్లతో దందా..?!
- వైఎస్ఆర్ కాలనీలో ప్లాట్ల అమ్మకాలు
- చౌటుప్పల్‌లో నిబంధనలకు తూట్లు
- రోడ్డును ఆక్రమించి రిజిస్ట్రేషన్

నాగార్జునసాగర్, జనవరి 19: ప్రభుత్వ భూమి ఎక్కడా మిగిలేలా లేదు. కోట్లాది రూపాయల విలువైన భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో ఆయా శాఖల ప్రభుత్వ ఉద్యోగులే గుర్తించి ప్రైవేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలకు తక్కువ ధరలకే లీజుకు ఇవ్వడంతో పాటు, అమ్ముతున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో కోట్ల విలువ చేసే వేలాది ఎకరాల ఎన్నెస్పీ భూములు ఉన్నాయి. ఆ భూములు ఖమ్మం జిల్లాలో ఇప్పటికే జీవో నెంబరు 58, 59 కింద అక్రమం గా కొందరు అక్రమార్కులు, గత అధికార పార్టీ నాయకులు ఆక్రమించుకున్నారు.ఇదే తరహాలో నాగార్జునసాగర్ హిల్ కాలనీలో తాగునీటి అవసరాల కోసం కోటి రూపాయల వ్యయంతో ఫిల్టర్ హౌజ్‌ను నిర్మించిన ఐదు ఎకరాల శ్రీ రామచంద్ర మిషన్‌కు అప్పగిస్తున్నారు. ఈ భూమి విలువ ప్రభుత్వ ధర ప్రకారం రూ.1.50 కోట్లు అవుతుంది. కానీ ఎన్నెస్పీ అధికారులు మాత్రం ఆ భూమిని 20 సంవత్సరాల కాలానికి నామ మాత్రపు రుసుముకే లీజుకు ఇచ్చారు. ఈ లీజు విషయాన్ని ఎన్నెస్పీ ఈఈ మల్లిఖార్జున్ దృష్టికి తీసుకెళ్లగా ఆ స్థలం లీజుకు ఇచ్చాము కానీ అక్కడ ఫిల్టర్ హౌజ్ ఉన్నట్లు తనకు తెలియదని చెప్పడం కొసమెరుపు.

కోర్టు కేసులు ఉన్నా....



హిల్‌కాలనీ వాసులు తాగునీటిని ఇబ్బందులు పడుతుండటంతో హిల్ కాలనీలో పాత ఫిల్టర్ హౌజ్ పక్కనే కోటి రూపాయల వ్యయంతో 2015లో నూతన ఫిల్టర్ హౌజ్‌ను నిర్మించారు. నదిలో నుంచి నీటిని ఫిల్టర్ హౌజ్‌లోకి తోడుకోవడానికి ఇన్‌టెక్ ఫిల్టర్ బెడ్‌లను నిర్మించారు. నూతన ఫిల్టర్ హౌజ్‌కు నీరు అందకపోవడంతో ప్రస్తుతం హిల్‌కాలనీకి ఫైలాన్ కాలనీ నుంచే తాగునీటిని సరఫరా చేస్తున్నారు. హిల్‌కాలనీలో నూతనంగా నిర్మించిన ఫిల్టర్‌హౌజ్‌కు నీటి సరఫరా కాకపోవడంతో ఎన్నెస్పీ అధికారులు సదరు కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకుండా నిలిపివేశారు. దీంతో కాంట్రాక్టర్ కోర్టును ఆశ్రయించాడు. అప్పటి నుంచి ఈ ఫిల్టర్‌హౌజ్ కోర్టు కేసులో ఉంది. అయినా ఎన్నెస్పీ అధికారులు మాత్రం శ్రీ రామచంద్ర మిషన్‌కు అప్పనంగా తక్కువ ధరకే లీజుకు ఇవ్వడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

స్థలం లీజు ఎంతో నాకు తెలియదు

శ్రీరామచంద్ర మిషన్ ప్రతినిధులు హిల్‌కాలనీలో స్థలాన్ని లీజుకు తీసుకునేందుకు ప్రభుత్వం నుంచి జీవో తీసుకువచ్చారు. 20 సంవత్సరాల లీజుకు ఇచ్చాము. కానీ లీజు ఎంతో కూడా తెలియదు. ఆ స్థలం ఎక్కడుందో కూడా తెలియదు.

- మల్లికార్జున్, ఎన్నెస్పీ ఈఈ

నిబంధనలకు తూట్లు

నిర్మాణాలు చేపడుతున్నా చర్యలు శూన్యం


చౌటుప్పల్ మునిసిపాలిటీ: హెచ్‌ఎండీఏ నిబంధనలతో పాట్ల లేఅవుట్ చేశారు. నిబంధనల ప్రకారం వెంచర్‌లో రోడ్ల నిర్మాణం చేసి ప్లాట్లను విక్రయించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఆ వెంచర్‌ను మునిసిపాలిటీకి అప్పగించారు. మార్టిగేజ్ చేసిన ప్లాట్లను వెంచర్ చేసిన రియల్ వ్యాపారులు హెచ్‌ఎండీఏ నుంచి రిలీజ్ చేసుకున్నారు. ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఇళ్ల నిర్మాణం చేపట్టారు. పెద్ద రోడ్లతో వెంచర్ చేసిన రియల్ వ్యాపారులే రోడ్లను ఆక్రమించి బై నెంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసిన వైనం చౌటుప్పల్ మునిసిపాలిటీ పరిధిలో చోటుచేసుకుంది.

లేఅవుట్‌లో చూపించారు... రోడ్డు కబ్జా చేశారు....

చౌటుప్పల్ పట్టణంలోని వలిగొండ రోడ్డులో 2017 సంవత్సరంలో 66 - 28 ఎకరాల్లో ఓ సంస్థ హెచ్‌ఎండీఏ నిబంధనలతో వెంచర్‌ను ఏర్పాటు చేసింది. వలిగొండ రోడ్డు నుంచి వెంచర్‌లోకి వెళ్లడానికి 80, 60, 40 ఫీట్ల రోడ్డుని వేశారు. ఇందులో 80 ఫీట్ల రోడ్డు వలిగొండ రోడ్డు వరకు కంట్యూనేషన్ ఉండాలి. కాని గతంలో గ్రామ పంచాయతీ లేఅవుట్ చేయడంతో ఆ వెంచర్ భూమి ఉండడం వల్ల బయటి వరకు కంట్యూనేషన్ కాలేదు. హెచ్‌ఎండీఏ ఇచ్చిన లేఅవుట్ మ్యాప్‌లో మాత్రం కంట్యూనేషన్ చూపించారు. వెంచర్ నుంచి వలిగొండ రోడ్డుకు వరకు 80 ఫీట్ల రోడ్డు లేదు. దీనిని ఆసరా చేసుకొని వెంచర్ చేసిన రియల్ వ్యాపారులు ఈ వెంచర్‌లో ప్రారంభమయ్యే ఒకటో నెంబర్ పార్ట్ నెంబర్ వేసి 60 గజాల రోడ్డు స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేశారు. హెచ్‌ఎండీఏ నిబంధనల ప్రకారం చేసిన వెంచర్‌లో పార్ట్ నెంబర్లతో ప్లాట్లు ఉండవు. కానీ వెంచర్ యాజమానులు నిబంధనలకు తూట్లు పొడిచి రిజిస్ట్రేషన్ చేశారు. హెచ్‌ఎండీఏ వెంచర్‌లో రోడ్డును ఆక్రమించి పిల్లర్ గుంతలు తీసి నిర్మాణ పనులు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మునిసిపల్ అధికారులను మేనేజ్ చేసుకొని సదరు వ్యక్తి నిర్మాణ పనులు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు స్పందించి వెంచర్‌లోని రోడ్డును కాపాడాలని వెంచర్‌లోని ప్రజలు కోరుతున్నారు.



నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



హెచ్‌ఎండీఏ నిబంధనలను ఉల్లంఘిస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. నిబంధనల ప్రకారం వెంచర్‌లో రోడ్లు ఉండాలి. మునిసిపల్ అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటారు. అక్రమ నిర్మాణాలు చేపడితే నిలిపివేస్తాం.

- వెన్‌రెడ్డి రాజు, మునిసిపల్ చైర్మన్

నార్కట్‌పల్లిలో అక్రమ ప్లాట్ల దందా?

నకిలీ సర్టిఫికెట్లతో వైఎస్ఆర్ కాలనీలో అమ్మకాలు



నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని బలహీన వర్గాల (వైఎస్ఆర్) గృహ కాలనీలో అక్రమ ప్లాట్ల దందా జరుగుతున్నట్లు ఆరోపణలు వినపడుతున్నాయి. ఏకంగా రెవెన్యూ కార్యాలయం జారీ చేసినట్లుగా పాత తేదీలతో తప్పుడు సర్టిఫికెట్లు సృష్టించి కొందరు దళారులు య థేచ్ఛగా కాలనీలోని లేఅవుట్లలో ప్లాట్లను అమాయకులకు అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అక్రమ ప్లాట్ల దందాపై నార్కట్‌పల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధులు గగ్గోలు పెట్టినా సంబంధిత అధికారులు హెచ్చరికలకే పరిమితమైందే తప్ప పూర్తిస్థాయిలో చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దీంతో నిజమైన అర్హులైన లబ్ధిదారులు నష్టపోతున్నారు.

23.39 ఎకరాల కొనుగోలు 510 ప్లాట్లు

నార్కట్‌పల్లి మండలం నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న సమయంలో తన సొంత మండలమైన నార్కట్‌పల్లిలో అర్హులైన నిరుపేదలకు బలహీన వర్గాల గృహ నిర్మాణ పథకం కింద సొంతింటి కలను నెరవేర్చాలని అప్పటి ఎమ్మెల్యే (ప్రస్తుత మంత్రి) కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సంకల్పించారు. ఇందుకు అవసరమైన ప్రభుత్వ భూమి లభ్యం కాలేదు. దీంతో మునుగోడుకు వెళ్లే దారిలో రాశీ రీ ఫ్యాక్టరీస్ లిమిటెడ్ పరిశ్రమ ఎదురుగా సర్వే నెంబర్లు 266, 267, 268, 283లలో సుమారు 23.39 ఎకరాల విస్తీర్ణంలో ప్రైవేట్ వ్యక్తులకు చెందిన భూమిని ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చొరవ చూపారు. అందులో అంతర్గత రోడ్లు, డ్రైనేజీతో పాటు సామూహిక ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలం పోను మిగతా స్థలాన్ని సమాన విస్తీర్ణంలో (121 గజాలు వచ్చేలా) 510 ప్లాట్లతో లే అవుట్ చేశారు. ఇందుకు గాను 480 మందిని లబ్ధిదారులను గ్రామసభల ద్వారా గుర్తించి ఎంపిక చేసి విడతల వారీగా పంపిణీ చేశారు. ఇంకా దాదాపు 30 ప్లాట్లను ఎంరికీ కేటాయించలేదు. విద్యుత్, నీటి వసతి కల్పించకపోవడంతో ఒక్క లబ్ధిదారుడు కూడా ఆ స్థలాల్లో ఇంటి నిర్మాణాలు చేపట్టలేదు. కొంత మంది పునాది వరకు నిర్మాణాలు చేపట్టి వదిలేశారు. తదనంతరం కరెంటు, నీటి వసతి ఏర్పాటు కావడంతో కాలనీలో ఇళ్ల నిర్మాణం ఊపందుకుంది.

కంటితుడుపు చర్య

వెఎస్ఆర్ కాలనీ లే అవుట్లలో ఖాళీగా ఉన్న ప్లాట్లకు కొందరు దళారులు తప్పుడు సర్టిఫికెట్లు తయారు చేయించి అమాయకులకు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నరు. విశ్రాంత తహసీల్దార్ హయాంలోనే జారీ చేసినట్లుగా ధ్రువీకరణ పత్రాలు సృష్టించి ప్లాట్లను విక్రయించినట్లు తహసీల్దార్‌కు స్థానిక ప్రజాప్రతినిధులు ఫిర్యాదు చేశారు. దీంతో కంటి తుడుపుగా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నారే తప్ప దందాకు చెక్ పెట్టలేదు.

అధికారులు చర్యలు తీసుకోవాలి



నార్కట్‌పల్లి వైఎస్ఆర్ కాలనీలో అక్రమ ప్లాట్ల దందాపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలి. పూర్తి స్థాయిలో విచారణ జరిపి కబ్జాకు గురైన ప్లాట్లను స్వాధీనం చేసుకోవాలి. అర్హులైన లబ్ధిదారులకు ఇంటి స్థలాన్ని అందజేయాలి.

- పుల్లెంల ముత్తయ్య, ఎంపీటీసీ, నార్కట్‌పల్లి

విచారణ చేసి చర్యలు తీసుకుంటాం

వైఎస్ఆర్ కాలనీలో అక్రమ ప్లాట్ల దందాపై ఇటీవల మండల సభలో ప్రజాప్రతినిధులు చేసిన ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటాం. తమ కార్యాలయం ద్వారా ఇంటి స్థలం పట్టాలను పంపిణీ చేసిన జాబితాను మాత్రమే పరిగణించి మిగతా కబ్జాలో ఎవరైనా ఉంటే ఖాళీ చేయిస్తాం.

- పద్మ, తహసీల్దార్

బస్వాపూర్ జలాశయం నిర్మాణంతో

చోక్లాతండా, కోక్యాతండాలు కనుమరుగు

- ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందించేందుకు అధికారుల సర్వే
- రూ.48.41 కోట్లు అవార్డును పాస్ చేసిన ప్రభుత్వం



చోక్లతండలో సర్వే చేస్తున్న అధికారులు

తుర్కపల్లి, జనవరి 19: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో 11.39టీఎంసీల సామర్థ్యంతో బస్వాపూర్ రిజర్వాయర్‌ను నిర్మిస్తోంది. ఈ రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా ప్రాజెక్టు బ్యాక్ వాటర్ కోసం నిర్మించే ఆనకట్ట నిర్మాణం కోసం ప్రభుత్వం రుస్తాపూర్, తిమ్మాపూర్, చోక్లతండా, కోక్యాతండ, పీర్యాతండ గ్రామాలకు చెందిన భూములను గతంలోనే సేకరించింది. ప్రభుత్వం 270 ఎకరాల భూమిని సేకరిస్తుండడంతో పీర్యాతండ తప్ప చోక్లతండ, కోక్యతండ గ్రామాలు పూర్తిగా ముంపునకు గురికానుండడంతో గత రెండు రోజులుగా ఇరిగేషన్ , రెవెన్యూ అధికారులు తండాలను సందర్శించి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద పరిహారం అందించేందుకుగాను గ్రామాల్లో ఎన్ని ఇళ్లు ఉన్నాయి? ప్రభుత్వ భవనాలు ఎన్ని ఉన్నాయి? ఎన్ని కుటుంబాలు ఉన్నాయి? 18 సంవత్సరాలు నిండిన వారు ఎంత మంది ఉన్నారు అనే దానిపై రెండు రోజులు సర్వే నిర్వహించారు. కాగా 270 ఎకరాలకుగాను 2022ఫిబ్రవరి నెలలో భూ సేకరణ కోసం 29 ఎకరాలకే నోటిఫికేషన్ జారీ చేసి, సేద్యం చేసున్న 20 ఎకరాల భూమికి మాత్రమే ఎకరాకు రూ.15.05లక్షలు చొప్పున చెల్లించింది. మిగతా 9ఎకరాల్లో డీటీసీపీఅ లేఅవుట్ ఉన్నందున పరిహారం ఇవ్వలేదు. ఈ లేఅవుట్‌లో కొందరు పాంట్లు కొనుగోలు చేశారు. ఈ ప్లాట్లకు ప్రభుత్వం తక్కువ పరిహారం ఇస్తుందని కొందరు పరిహారం తీసుకోలేదని తెలిసింది. 2023నవంబరు 9న 241ఎకరాల భూమిని సేకరిస్తున్నట్లు ప్రభుత్వం రెండోసారి నోటిఫికేషన్ జారీ చేసి, రూ. 48.41కోట్లు కేటాయిస్తూ అవార్డును పాస్ చేసింది. అవార్డు పాస్ చేశామని అధికారులు పేర్కొనడంతో తండా వాసులు భువనగిరి ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి అధికారులను సంప్రదించగా, ఎకరాకు రూ.26,87,1200 చొప్పున, వ్యవసాయేతర భూములకు గజానికి రూ.1687ల చొప్పున, డీటీసీపీ ప్లాట్లకు గతంలో రూ.1296లు కేటాయించగా ప్రస్తుతం రూ.2800 చొప్పున అవార్డు అయినట్లు అధికారులు తెలిపారని తండా వాసులు పేర్కొన్నారు. ఈ డబ్బుల కోసం అధికారులను సంప్రదించగా ఎన్నికల కోడ్ అమలులో ఉందని చెప్పారు. ఎన్నికల కోడ్ తర్వాత అడిగితే ఆ డబ్బులు మరొకరికి కేటాయించారని అధికారులు పేర్కొంటున్నారని తండా వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు సంవత్సరాలుగా తమ గ్రామాలు, భూములు ముంపుకు గురవుతున్నాయని అధికారులు చెప్పడంతో క్రయ విక్రయాలు లేకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తండా వాసులు తెలిపారు. ప్రభు త్వం స్పందించి భూ పరిహారం అందించాలని తండా వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.


వడపర్తి రెవెన్యూ పరిధిలో పునరావాసం కల్పించాలి



బస్వాపూర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న చోక్లతండ, కోక్యా తండ వాసులకు భువనగిరి మండలం వడపర్తి రెవెన్యూ పరిధిలోని ఎస్ఆర్ స్కూల్ సమీపంలో పునరావాసం కల్పించాలి. చోక్లతండ పంచాయతీ పరిధిలో మూడు తండాలు ఉండగా అందులో చోక్లతండ, కోక్యా తండ పూర్తిగా ముంపునకు గురవుతుండగా పీర్యాతండకు 70 ఎకరాల భూమి ముంపునకు గురవుతోంది. తండ మాత్రమే మిగులుతుంది. ఈ తండావాసు లు భూములు కోల్పోతున్నారు కాబట్టి వారికి కూడా ప్రభుత్వం ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ కల్పించాలి.

- భూక్య సరితరామోజీనాయక్, సర్పంచ్ చోక్లతండా

ముంపు బాధితులకు పరిహారం అందించాలి



బస్వాపూర్ రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులందరికీ ప్రభుత్వం వెంటనే డబ్బులు ఇచ్చి ఆదుకోవాలి. అధికారులు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కోసం చేపట్టిన సర్వే నివేదికలను త్వరత గతిన ప్రభుత్వానికి అందజేసి, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ డబ్బులు చెల్లించాలి.

-దనావతు మోహన్‌బాబు, ఎంపీటీసీ, రుస్తాపూర్

ఉద్యోగావకాశాలు కల్పించాలి



బస్వాపూర్ జలాశయం నిర్మాణంలో భూములు, ఇళ్ల కోల్పోయిన వారి కుటుంబాల పిల్లలకు యాదగిరిగుట్ట దేవస్థానంలో గానీ, బస్వాపూర్ ప్రాజెక్టులోగానీ ఉద్యోగావకాశాలు కల్పించాలి. ఈ ప్రాంత యువకులను ప్రభుత్వం ఆదుకోవాలి.

-భూక్య పీక్లా నాయక్, చోక్లతండా

వైభవంగా ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవ



ఊంజల్ సేవలో అమ్మవారు

యాదగిరిగుట్ట, జనవరి 19: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శుక్రవారం స్వామికి సువర్ణ పుష్పార్చనలు, ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా నిర్వహించారు. ప్రభాతవేళ సుప్రభాతంతో స్వయంభువులను మేల్కొలిపిన ఆచార్యులు వేదమంత్ర పఠనాలతో పంచామృతాలతో అభిషేకించి, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యతిరుకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. కొండపైన అనుబంధ శివాలయంలో రామలింగేశ్వరుడికి నిత్య పూజలు, యాగశాలలో చండీ హోమం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. సాయంత్రం వేళ ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారిని పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకస్వాములు ప్రాకార మండపంలోని అద్దాల మండపంలో ఊయలలో అధిష్ఠింపజేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల నడుమ ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.19,46,626 ఆదాయం సమకూరినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

చివ్వెంల, జనవరి 19 : సూర్యాపేట జిల్లాకేంద్రం సమీపంలోని కుడకుడలో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఘటనకు సంబంధించి ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఇందిరమ్మకాలనీలో నివాసముంటున్న ఖమ్మంపాటి సాయిరాం(25) ఓ ప్రైవేట్ పెస్టిసైడ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి కుడకుడకు చెందిన తోటి ఉద్యోగి బామర్ చైతన్యతో కలసి బైక్‌పై కోదాడ నుంచి సూర్యాపేటకు వస్తుండగా వాహనం అదుపుతప్పి జాతీయరహదారిపై ఉన్న డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి అంబులెన్స్‌లో సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ఖమ్మంపాటి సాయిరాం మృతి చెందారు. బామర్ చైతన్య తలకు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. సాయిరాంకు భార్య ప్రియాంక, కుమార్తె ఉంది. కాగా ప్రస్తుతం ప్రియాంక గర్భిణి, ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు...

నార్కట్‌పల్లి, జనవరి 19 : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి ఏఎస్ఐ నర్సిరెడ్డి తెలిపిన వివరాల మేరకు నల్లగొండ మండలం అన్నెపర్తి గ్రామానికి చెందిన జక్కలి రాములు(43) మెకానిక్‌గా పని చేస్తూ కొంతకాలంగా నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డి గూడెంలో నివసిస్తున్నాడు. కాగా ఈ నెల 15వ తేదీన వ్యవసాయబావి వద్దకు బైక్‌పై వెళ్లి వస్తున్నాడు. చెర్వుగట్టు ఆర్చీ వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలు కాగా మెరుగైన చికిత్స నిమిత్తం రాములును హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు ఏఎస్ఐ తెలిపారు. రాములు భార్య పుష్ప ఫిర్యాదు మేరకు కేసు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

చిట్యాల రూరల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు దుర్మరణం చెందారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం జాతీయ రహదారిపై పెద్దకాపర్తి శివారులో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ ఇరుగు రవి తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన రుద్రారపు మల్లేశ్(40) పెద్దకాపర్తి శివారులో రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మల్లేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఘటనకు సంబంధించి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో ఏపీకి చెందిన లారీ డ్రైవర్ మృతి



వీరభద్రరావు మృతదేహం

రామన్నపేట, జనవరి 19 : యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేటలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ గుండెపోటుతో మృతి చెందాడు. ఏఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలకేంద్రానికి చెందిన ఎల్లంకి వీరభద్రరావు (51) 15 ఏళ్లుగా లారీడ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 16న ఏపీ16టీఈ 6194 నెంబరు గల లారీలో కోళ్ల దాణాను లోడ్ చేసుకొని నిజామాబాద్‌లో అన్‌లోడ్ చేశాడు. శుక్రవారం తెల్లవారు జామున సంగారెడ్డి జిల్లా చేగుంటలో తిరిగి కోళ్ల దాణాను లోడ్ చేసుకొని క్లీనర్ పిల్లలమర్రి రాజుతో కలిసి స్వస్థలం కంచికచర్లకు బయలుదేరాడు. వంట్లో బాగాలేదని భువనగిరి నుంచి లారీని నెమ్మదిగా నడుపుకుంటూ ఉదయం 9.30గంటల సమయంలో రామన్నపేటకు చేరుకొని లారీని పక్కకు ఆపాడు. క్లీనర్‌తో కలిసి టిఫిన్ చేశాడు. అనంతరం డ్రైవింగ్ సీట్లో స్టీరింగ్‌పై తలవాల్చి వీరభద్రారావు, పక్కన సీట్లో క్లీనర్ రాజు నిద్రపోయారు. మధ్యాహ్నం సమయంలో క్లీనర్ లేచి మంచినీళ్ల తీసుకువచ్చి బయలుదేరేందుకు వీరభద్రరావును లేపడానికి ప్రయత్నించాడు. ఎంత పిలిచినా పలకపోవడంతో స్థానికుల సహాయంతో 108వాహనంలో రామన్నపేట ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.వీరభద్రరావు కుమారుడు సాయిరామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

త్రీఫేజ్ విద్యుత్ 12 గంటల సరఫరా చాలు



జాన్‌పహాడ్‌లో రైతులతో మాట్లాడుతున్న డీఈ వెంకటకృష్ణ

పాలకవీడు, జనవరి 19:త్రీఫేజ్ విద్యుత్ 12 గంటలు చాలంటూ సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం జాన్‌పహాడ్ గ్రామానికి చెందిన పలువురు వినతిపత్రం అందజేసినట్లు ట్రాన్స్‌కో డీఈ వెంకటకృష్ణ తెలిపారు. పాలకవీడు మండలంలో ప్రజలు, రైతుల అభిప్రాయాలు ఆయన శుక్రవారం సేకరించారు. జాన్‌పహాడ్ గ్రామానికి చెందిన కొందరు రైతులు డైరక్టర్ ఆఫ్ ఆపరేషన్ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి తమకు 18 గంటల విద్యుత్ వద్దని 12 గంటలు త్రీఫేజ్ విద్యుత్ ఇస్తే చాలని వినతిపత్రం ఇచ్చారన్నారు. శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామాల్లో విచారణ చేపట్టగా చెర్వుతండా గ్రామానికి చెందిన రైతులు కోతలు లేకుండా ఇప్పుడు ఇస్తున్నట్లు విద్యుత్ ఇవ్వాలని కోరారన్నాడు. జాన్‌పహాడ్, దర్గా, కల్మెటతండా ప్రాంతానికి చెందిన వారు మాత్రం 12 గంటలు చాలన్నారని వివరించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.

సంచార పశువైద్యశాలను సద్వినియోగం చేసుకోవాలి

హుజూర్‌నగర్, జనవరి 19: రాష్ట్ర వ్యాప్తంగా సంచార పశు వైద్యశాలలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జీవీకేఈఎంఆర్ఐ ప్రాజెక్ట్ మేనేజర్, డాక్టర్ భగీష్ మిశ్రా, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ నజీరుద్దీన్ కోరారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో సంచార పశు వైద్యశాల ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించి పశుయజమానులకు మందులు పంపిణీ చేశారు. పశుసంపదను కాపాడుకోవాలన్నారు. నియోజకవర్గంలోని గ్రామాలకు సంచార పశువైద్యశాల వెళ్తుందన్నారు. రైతులకు అందుబాటులోకి రావడమే సంచార పశువైద్యశాల ముఖ్య ఉద్దేశమన్నారు. రైతులు పాడిసంపదను పెంచుకోవాలన్నారు. పశువులకు అందించిన చికిత్స వివరాల రికార్డులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సోమేశ్వర్, ప్రశాంత్, నగేష్, గోపి, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

చివ్వెంల, జనవరి 19:గంజాయిని రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సూర్యాపేట జిల్లా చివ్వెంల ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గరిడేపల్లి మండలం మర్రికుంట గ్రామానికి చెందిన నందిగామ డేవిడ్ సూర్య సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఇందిరమ్మకాలనీలో నివాసముంటున్నాడు. కాలనీకి చెందిన స్నేహితుడు బొంత అభినాష్‌తో కలిసి సూర్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అరకులో కిల 250 గ్రాముల గంజాయి కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయించేందుకు లారీలో వచ్చాడు. శుక్రవారం చివ్వెంల మండలం బీబీగూడెంలో మధ్యాహ్న సమయంలో పోలీసులు వాహన తనిఖీ చేస్తుండగా లారీని దూరంలో ఆపి సూర్య, అభినాష్‌లు గంజాయి బ్యాగుతో నడుచుకుంటూ వెళ్తున్నారు. అనుమానంతో పోలీసులను వెంబడించి సూర్యను అదుపులోకి తీసుకుని బ్యాగులను తనిఖీ చేయగా రూ.15 వేల విలువైన కిలో 250 గ్రాముల గంజాయి లభ్యమైంది. అభినాష్ అక్కడి నుంచి పారిపోయాడు. సూర్యను అదుపులోకి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

24 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుబడిన పీడీఎస్ బియ్యాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గరిడేపల్లి, జనవరి 19 : సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రంలోని పొనుగోడు క్రాస్‌రోడ్డు వద్ద శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు 24 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఎస్ఐ పీ వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం తెల్లవారుజామున ప్రజాపంపిణీ బియ్యం అక్రమ రవాణా జరుగుతుందని సమాచారం మేరకు మండలకేంద్రంలోని క్రాస్‌రోడ్డు వద్ద వాహన తనిఖీ నిర్వహిస్తుండగా టీఎస్ 05 యూఎఫ్ 6431 నెంబరు గల డీసీఎం వ్యాన్ గడ్డిపల్లి నుంచి గరిడేపల్లి వైపు వెళ్తుండగా తనిఖీ చేశారు. అందులో 24 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి డ్రైవర్ జిల్లపల్లి సంజీవ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. తనిఖీలో సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

పెద్దవూర, జనవరి 19: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని చలకుర్తి క్యాంపు నవోదయ విద్యాసమితిలో 2024-25 సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి శనివారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నాగభూషణం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,623 మంది దరఖాస్తులు చేసుకోగా 25 కేంద్రాల్లో పరీక్షను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పరీక్ష ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు ఉంటుందన్నారు. సమయానికి రావడంతో పాటు హాల్‌టికెట్, నలుపు, నీలం బాల్ పెన్ తప్ప ఏ ఇతర పరికరాలను తీసుకరావద్దన్నారు.

విద్యాదాఘాతంతో రెండు పాడిగేదెలు మృతి

మఠంపల్లి, జనవరి 19 : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలో విద్యుదాఘాతంతో శుక్రవారం రెండు పాడిగేదెలు మృతి చెందాయి. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం మఠంపల్లికి చెందిన కీసరి పెద్దనాగయ్యకు చెందిన రెండు పాడి గేదెలు మేతకు వెళ్లే క్రమంలో శుక్రవారం మఠంపల్లి 132 కేవీ సబ్‌స్టేషన్ పక్కన తెగిపడిన విద్యుత్ తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ఘటనతో సుమారు రూ.1.20లక్షలు ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు నాగయ్య తెలిపారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

● మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్

కట్టంగూరు, నకిరేకల్, జనవరి 19: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. కట్టంగూరు, నకిరేకల్‌లలో శుక్రవారం నిర్వహించిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అయోధ్యలో రామమందిర నిర్మాణంతో దేశంలోని 140 కోట్ల భారతీయ ఆకాంక్షను నెరవేర్చినట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీని గెలిపించి మరోసారి నరేంద్రమోదీని ప్రధాన మంత్రి చేయడానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. ఆయా సమావేశాల్లో అసెంబ్లీ కన్వీనర్ ఖైలా శ్రీనివాస్, కో కన్వీనర్ మందూరి ప్రభాకర్‌రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాస శ్రీను, నాయకులు అఖిల్, ఎం. నర్సింహ, ప్రభాకర్‌రావు, గోలి ప్రభాకర్, పబ్బు వెంకన్న, కోమటి భాస్కర్, పులకరం శంకర్, గున్నాల నాగరాజు, అంజిబాబు, సాయికుమార్, నాగరాజు, వినోద్, పల్స శ్రీను, యానాల శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, రాములు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా కల్యాణ్‌నాయక్


కల్యాణ్‌నాయక్

దేవరకొండ, జనవరి 19: బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ జర్పుల కల్యాణ్‌నాయక్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నియమించారు. కల్యాణ్‌నాయక్ 2018లో దేవరకొండ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేశారు. నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జిగా పనిచేసి ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేశారు. తనను గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించినందుకు కల్యాణ్‌నాయక్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలపై దాడులు అరికట్టడంలో విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న సైదమ్మ

మిర్యాలగూడరూరల్, జనవరి 19: దేశంలో, రాష్ట్రంలో రోజురోజుకు మహిళలపై పెరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయని ఏఐఎఫ్‌డబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు వస్కుల సైదమ్మ ఆరోపించారు. మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో శుక్రవారం రామాంజి జ్యోతి అధ్యక్షతన నిర్వహించిన ఏఐఎఫ్‌డబ్ల్యూ జిల్లా కమిటీ సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో మహిళలకు ప్రత్యేక చట్టాలను రూపొందించి వాటిని అమలు చేయాలన్నారు. జనాభాలో పురుషులతో సమానంగా నేటి స్త్రీలు చదువులు, ఉద్యోగాలు, వివిధ వృత్తుల్లో రాణిస్తున్నా నేటికీ స్త్రీలను రెండో శ్రేణి పౌరులుగానే చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టసభల్లో మహిళలకు 30 శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు సుకన్య, రమణ, ఆమని, మౌనిక, యాదమ్మ, లింగమ్మ, కరుణ, సైదమ్మ, ఎల్లమ్మ, చంద్రమ్మ, అనసూర్య తదితరులు పాల్గొన్నారు.

వారం రోజులపాటు జాతీయ బాలిక దినోత్సవ కార్యక్రమాలు

నల్లగొండ టౌన్, జనవరి 19: జిల్లాలోని అన్ని ఉన్నత బాలికల పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలు, గురుకుల బాలికల పాఠశాలల్లో జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా వారం రోజుల పాటు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి కేవీ. కృష్ణవేణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో బాలికలకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలతో పాటు సంతకాల సేకరణ ప్రతిజ్ఞ, గ్రామసభలు, పోస్టర్లు, ఆటల పోటీలు, బాలికల ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన, మొక్కలు నాటడం, బేటీ బచావో బేటీ పడావో వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 24వ తేదీన జాతీయ బాలికా దినోత్సవాన్ని కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవనంలో ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు.

భూ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

మర్రిగూడ, జనవరి 19: డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చర్లగూడ రిజర్వాయర్‌లో ముంపునకు గురైన బాధిత భూనిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పునరావాసం కల్పించి రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలని టీడీపీ రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి ముద్దం శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చర్లగూడ రిజర్వాయర్‌లో ముంపునకు గురైన బాధిత భూనిర్వాసితులకు పరిహారం, పునరావాసం కల్పించకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వారిని ఆదుకోవాలని, పరిహారం పెంచడమే కాకుండా త్వరగా పునరావాసం కల్పించాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు దోమల వెంకన్న, ప్రధాన కార్యదర్శి పుప్పాల యాదయ్య, ప్రధాన కార్యదర్శి పగడాల లింగయ్య, అంజయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ టౌన్, జనవరి 19: జిల్లాలోని మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 2024 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి విష్ణు ఒక ప్రకటనలో తెలిపారు. గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో కొత్త సీట్లకు, 6,7,8 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లతో పాటు జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరానికి ప్రవేశాలకు ఫిబ్రవరి 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అవిశ్వాసాలపర్వం

● పీఏపల్లి పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం
● వీగిన తడకమళ్ల పీఏసీఎస్ అవిశ్వాస తీర్మానం
● కొనసాగనున్న పాత పాలక వర్గం

మిర్యాలగూడ, పెద్ద అడిశర్లపల్లి, జనవరి 19: జిల్లాలో పీఏసీఎస్‌లలో అవిశ్వాస పర్వం మొదలైంది. మిర్యాలగూడ మండలం పరిధిలోని తడకమళ్ల పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్లపై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. పెద్దఅడిశర్లపల్లి మండలంలోని సింగల్‌విండో చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్ర వేశపెట్టాలని డైరెక్టర్లు సహకార సంఘం అధికారి కిరణ్‌కుమార్‌కు నోటీసులు అందజేశారు.


అవిశ్వాస తీర్మానాన్ని కిరణ్‌కుమార్‌కు అందజేస్తున్న పీఏపల్లి పీఏసీఎస్ డైరెక్టర్లు

● మిర్యాలగూమండల పరిధిలోని తడకమళ్ల పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్లపై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. అవిశ్వాస తీర్మానానికి సభ్యులు నోటీసు ఇవ్వడంతో శుక్రవారం జిల్లా అధికారులు పీఏసీఎస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యాలయంలో అధికారులు వేచిచూసినా సభ్యులు రాకపోవడంతో అవిశ్వాసం వీగిపోయినట్లు జిల్లా సహకార అధికారి కిరణ్‌కుమార్ ప్రకటించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 13 మంది సభ్యులు ఉండగా 9మంది సభ్యులు చైర్మన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాసం పెట్టాలని గతేడాది డిసెంబరు 28న జిల్లా అధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో జనవరి 18న అవిశ్వాస తీర్మానానికి సభ్యులు హాజరుకావాలని సభ్యులకు అధికారి అదే రోజు నోటీసులు జారీ చేశారు. కాగా జిల్లా అధికారి అనారోగ్య కారణాల వల్ల ఒక రోజు ఆలస్యం 19వ తేదీన అవిశ్వాస సమావేశం నిర్వహించగా సభ్యులెవరూ హాజరుకాకపోవడంతో అవిశ్వాపం వీగినట్లు ప్రకటించారు. అవిశ్వాస సమావేశం సందర్భంగా పీఏసీఎస్ కార్యాలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి పర్యవేక్షణలో ఒక సీఐ, నలుగురు ఎస్ఐలు, 50మంది సిబ్బందితో పోలీసు బందోబస్తు నిర్వహించారు. క్లస్టర్ అధికారి రాంబాయి, ఆఫీస్ సూపరింటెండెట్ విజయ్‌కుమార్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ నారాయణస్వామి, జేఏ సుభాన్, సీఈవో నర్సయ్య పాల్గొన్నారు.

అవిశ్వాసాలు మాని పథకాలను అమలుచేయాలి : చింతరెడ్డి

మిర్యాలగూడరూరల్: అవిశ్వాసాలు మాని పథకాలను అమలు చేయాలని రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తడకమళ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు అమలుకు నోచుకోని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటి అమలుపై దృష్టి పెట్టకుండా మునిసిపాలిటీలు, పీఏసీఎస్‌లను కుట్ర పూరితంగా లాక్కోవాలని చూస్తోందని ఆరోపించారు. రైతులకు మేలు చేస్తున్న పీఏసీఎస్‌లపై ప్రభుత్వం రాజకీయాలు చేస్తుందని ఆరోపించారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మట్టపల్లి సైదులుయాదవ్, వైస్ ఎంపీపీ అమరావతి సైదులు, నాయకులు మోహన్‌గౌడ్, శేఖర్‌రావు, రవి, నాగయ్య, భిక్షం, వెంకటయ్య, సోమయ్య పాల్గొన్నారు.


పీఏసీఎస్‌లో అవిశ్వాస తీర్మాన సమావేశానికి హాజరైన జిల్లా అధికారులు

● పెద్దఅడిశర్లపల్లి మండలంలోని సింగల్‌విండో చైర్మన్ యోల్గురి వల్లపురెడ్డిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని అదే సొసైటీలో పని చేస్తున్న 10 మంది డైరెక్టర్లు శుక్రవారం జిల్లా సహకార సంఘం అధికారి కిరణ్ కుమార్‌కు నోటీసులు అందజేశారు. ప్రస్తుతం ఆ సొసైటీలో సహకార సంఘం పాలకవర్గ సభ్యులు 2020 ఫిబ్రవరి 15న ఎన్నికయ్యారు. ఇందులో తొమ్మిది మంది డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం ఆమోదించాలని సంతకాలు పెట్టి డీసీవోకు లేఖను అందజేశారు. అవిశ్వాస తీర్మానం సందర్భంగా 13 మంది డైరెక్టర్లలో 9 మంది డైరెక్టర్లు హాజరై అవిశ్వాస తీర్మానానికి ఓటు వేస్తే అవిశ్వాసం నెగ్గనుంది. ఈ డైరెక్టర్లలో పీఏపల్లి మండల కేంద్రానికి చెందిన తేరా మణిపాల్‌రెడ్డి సొసైటీ చైర్మన్ రేసులో ఉన్నట్లు సమాచారం.

బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం

● మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

నల్లగొండరూరల్, జనవరి 19: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేటు అనుకూల విధానాలు, మతతత్వ విధానాలను ప్రతిఘటిస్తూ దేశవ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. కార్మిక కర్షక మైత్రి దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమురయ్య భవనంలో శుక్రవారం సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చి పదేళ్లవుతున్నా రైతులు కార్మికుల సమస్యలు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. పరిష్కాలేదని ఆరోపించారు. కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. సీఐటీయూ వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘాల జిల్లా కార్యదర్శులు తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, కుస్‌రెడ్డి నాగిరెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా సెక్టోరియల్ సమ్మె గ్రామీణ భారత్ బంద్ జయప్రదం కోసం దశలవారీగా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. జనవరి 20నుంచి ఇంటింటి ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఫిబ్రవరి 16న సమ్మె సందర్భంగా కరపత్రాలు, ప్రజలతో సంతకాల సేకరణ గ్రామ మండల స్థాయిలో రైతులు వ్యవసాయ కార్మికులు కార్మికులతో ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు చినపాక లక్ష్మీనారాయణ వీరపల్లి వెంకటేశ్వర్లు బొజ్జ చిన్నవెంకులు, కందాల ప్రమీల, దండెంపల్లి సరోజ, డబ్బీకార్ మల్లేష్, శ్రీశైలం ఆనంద్, సలీం సత్తయ్య, తిరుపతి పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రం

● సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం


సమావేశంలో మాట్లాడుతున్న నెల్లికంటి సత్యం

మర్రిగూడ, జనవరి 19: బీజేపీ ప్రభుత్వం రైతు, కార్మిక, వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్పొరేట్ వర్గాలకు దేశ సంపదను దోచిపెడుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అయోధ్య శ్రీరాముని పేరుతో ప్రజల నుంచి ఓట్లను పొందుకోవడానికి బీజేపీ ప్రయత్నిస్తుందని అన్నారు. ప్రజల మౌలిక సమస్యలు, నిరుద్యోగ, పేదరికం కేంద్రప్రభుత్వం పరిష్కరించకుండా ఓ పథకం ప్రకారం ఓట్లు పొందుకోవడానికి ప్రయత్నిస్తుందని ఆరోపించారు. అప్రజాస్వామికంగా నియతృంత్వ పాలన సాగిస్తున్న బీజేపీకి ప్రజలు సరైన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. మతం, దేవుడు వారి వ్యక్తిగత నమ్మకాలను దీనిని సొమ్ము చేసుకోవాలని బీజేపీ ప్రయత్నం చేయడం దుర్మార్గమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆకాంక్ష మేరకు సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తుందని, ఆ నమ్మకాన్ని కాంగ్రెస్ నిలబెట్టుకోవాలన్నారు. జిల్లాల్లో పెం డింగ్ ప్రాజెక్టులైన ఎస్ఎల్‌బీసీ, చర్లగూడ రిజర్వాయర్‌లను పూర్తిచేసి జిల్లా పూర్తిగా సస్యశ్యామలం మారే విధంగా చూడాలని కోరారు. సీపీఐ మండల కార్యదర్శి భిక్షంరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బూడిద సురేష్, నిరంజన్, రఘుమయ్య, గిరి, బాలకిషన్, కొమరయ్య, రవి, నర్సింహ పాల్గొన్నారు.

'దళితబంధు' వెంటనే ప్రారంభించాలి


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

నల్లగొండటౌన్, జనవరి 19: గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ అధికారులు దళితబంధు పథకం కింద ఎంపిక చేయబడిన లబ్ధిదారులకు నిధులు విడుదల చేసే ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని దళితబంధు సాధన సమితి జిల్లా కన్వీనర్ పాలడగు నాగార్జున, పందుల సైదులు డిమాండ్ చేశారు. దళిత బంధు ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం శాలిగౌరారం మండలానికి చెందిన దళితబంధు లబ్ధిదారులు 270మందితో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ ప్రభుత్వం భేషజాలకు పోకుండా, పార్టీల మధ్యన ఉన్న వైషమ్యాలను పక్కన పెట్టి దళితబంధుకు ఎంపికైన లబ్ధిదారులకు నిధులు చెల్లించాలని అన్నారు. ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణలో జరగాల్సిన ప్రక్రియ మొత్తం జరిగిందని విడుదల చేసే నిధులను ఫ్రీజింగ్ చేయడం సరికాదని వారన్నారు. నల్లగొండ నియోజకవర్గంలోని 1050 మందికి ప్రొసీడింగ్స్ ఇచ్చారని, తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని శాలిగౌరారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 270 మందిని దళితబంధు పథకం కింద ఎంపిక చేసినట్లు తెలిపారు. నిధులను మంజూరు చేయుటకు వేగవంతంగా గ్రౌండ్ చేసి జీవనోపాధి పొందుటకు అవకాశం కల్పించి నిధులు విడుదల చేయాలని కోరారు. తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు మాట్లడుతూ కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆరోగ్యశ్రీ లాంటి సంక్షేమ పథకాల మాదిరిగానే దళితబంధు పథకాన్ని కూడా అమలుచేయాలని డిమాండ్ చేశారు. అవసరమైతే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రూ. 12లక్షలు దళితబంధు లబ్ధిదారులకు మంజూరు చేసి వారి ఆదరాభిమానాలను పొందాలని విజ్ఞప్తి చేశారు. ఆందోళన కార్యక్రమంలో కార్యక్రమంలో మామిడి రమేష్, ఏర్పుల నరేందర్, పోతేపాక నవీన్, బడుపుల శంకర్, మామిడి యాకూబ్, అద్దంకి రవీందర్, రాచకొండ గణేష్, మాచర్ల వెంకట్, ఈర్ల కిరణ్, డేగాల ఏలీష, మాగి రవి, పులిగిల్ల శంకర్, పనికర కమలాకర్, గుండ్లపల్లి రవి, ఉదయ, వంశీ, నరేష్, దావీదు పాల్గొన్నారు.

ప్రాజెక్టు పనులు వెంటనే పూర్తి చేయిస్తాం

● ఐబీ ఈఈ విజయకుమార్


ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఐబీ ఈఈ విజయ్‌కుమార్

శాలిగౌరారం, జనవరి 19: అసంపూర్తిగా ఉన్న శాలిగౌరారం ప్రాజెక్టు పనులను కాంట్రాక్టర్‌తో వెంటనే పూర్తి చేయిస్తామని నీటిపారుదలశాఖ ఈఈ విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం శాలిగౌరారం ప్రాజెక్టును ఆయన పరిశీలించి మాట్లాడారు. రూ.5.10కోట్ల నిధుల్లో రూ.2కోట్ల30లక్షల పనులు పూర్తయినట్లు తెలిపారు. మిగిలిన పనులను దశల వారీగా రైతులకు ఇబ్బంది లేకుండా, ప్రాజెక్టు షట్టర్లు బిగించి నీటిని నిల్వ చేస్తామన్నారు. రూ.5 కోట్లలో ఎలాంటి అవినీతి జరగలేదని, పనులు పారదర్శకంగా జరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఐబీడీఈ సత్యనారాయణ, జేఈ అమర్, ఏఈ మేడి రాములు, రైతు చామల వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవినీతి, అక్రమాలను వెలికితీయాలి

● మట్టిమనిషి వేదిక నాయకుడు వేనేపల్లి పాండురంగారావు


పాండురంగారావు

మిర్యాలగూడ, జనవరి 19: గత ప్రభుత్వ పాలనలో నియోజకవర్గంలో జరిగిన అవినీతి, అక్రమాలను వెలికితీయాలని మట్టిమనిషి వేదిక నాయకుడు వేనేపల్లి పాండురంగారావు డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ పాలక నాయకులు అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. దామరచర్ల మండలం యాదాద్రి పవర్‌ప్లాంట్‌లో అడుగడుగునా అక్రమాలు జరిగాయని ఆరోపించారు. భూసేకరణ, పరిహారం, పనుల కేటాయింపుల్లో అవకతవకలకు పాల్పడ్డారని అన్నారు. ప్రతిపక్ష అధికార పార్టీ నేతలతో కుమ్మక్కై భారీ మోసాలకు పాల్పడ్డారని అన్నారు. ప్రభుత్వ భూములు అక్రమంగా రాయించుకుని ప్రభుత్వం నుంచి నష్టపరిహారం పొందారని ఆరోపించారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో నియోజకవర్గంలో జరిగిన అన్ని అవినీతి, అక్రమాలపై న్యాయ విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని, వారి ఆస్తులను స్వాధీనం కోరారు.

వైద్యశిబిరాల ఏర్పాటు అభినందనీయం : బీఎల్ఆర్

మిర్యాలగూడ అర్బన్, జనవరి 19: ప్రజారోగ్య పరిరక్షణ చర్యల్లో భాగంగా పల్లె, పట్టణ ప్రాంతాల్లో స్వచ్ఛంద సేవా సంస్థలు వైద్యశిబిరాలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని అశోక్‌నగర్‌లోని వర్షిత మల్టిస్పెషాలిటీ ఆస్పత్రిలో శుక్రవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు ఉపయోగపడే విధంగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం వైద్యశిబిరానికి హాజరైన రోగులకు మలక్‌పేట యశోద ఆస్పత్రి గ్యాస్ట్రోఎంట్రాలజీ డాక్టర్ రమాకాంత్, అంకాలజీ వైద్య నిపుణులు డాక్టర్ రోహిత్‌రెడ్డి, నివాళిక వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో లయన్‌క్లబ్ పట్టణాధ్యక్షుడు కర్నాటి రమేష్, ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ కూటాల రాంబాబు, లయన్స్ డిస్ట్రిక్ట్ మాజీగవర్నర్ కేఎల్‌ప్రసాద్, సభ్యులు వెంకటేశ్వర్లు, జాడి రాజు, రవీందర్‌రెడ్డి, ఏచూరి మురహరి, సైదులు, చైతన్య, భాగ్యలక్ష్మి, చిలుకూరి బాలు పాల్గొన్నారు.

బినామీ డీలర్ రుజువైతే క్రిమినల్ కేసు : డీఎస్వో


రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్‌వో వెంకటేశ్వర్లు

పెద్దఅడిశర్లపల్లి, జనవరి 19: బినామీ డీలర్ ఉన్నట్లు రుజువైతే సదరు వ్యక్తిపై 6ఏ కేసుతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేస్తామని డీఎస్‌వో వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మండలంలోని రంగారెడ్డిగూడెం, మేడారం గ్రామాల్లోని ప్రభుత్వ చౌక దుకాణాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. బియ్యం నాణ్యతను పరిశీలించి, నాణ్యమైనవి సరఫరా చేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలు కొనసాగుతాయని తనిఖీ సమయంలో దుకాణంలో ఒరిజినల్ డీలర్ మాత్రమే దుకాణం నిర్వహించాలని, రికార్డుల ప్రకారం నిల్వలు ఉండాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ- కేవైసీ డేటాను వంద శాతం పూర్తి చేయాలని ఆయన తెలిపారు. ప్రతీ డీలర్ తమ దుకాణం వివరాలు, జిల్లా పౌరసరఫరాల అధికారి, సంబంధిత తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్ (సివిల్ సప్లయ్) మొబైల్ నంబర్లతో కూడిన బోర్డు, టోల్‌ఫ్రీ నంబర్ 1937 వినియోగదారులకు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలని సూచించారు. సబ్సిడీ బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినియోగదారులు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట దేవరకొండ డీటీసీఎస్ శ్రీనివాస్‌గౌడ్, పెద్దవూర డీటీసీఎస్ ముక్తార్ ఉన్నారు.

సంక్షిప్త సమాచారం...

కొండమల్లేపల్లి, దేవరకొండ, శాలిగౌరారం, మాడ్గులపల్లి: ఓటరు నమోదుకు ఈ నెల 20, 21 తేదీల్లో అన్ని గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో బాలరాజురెడ్డి, తహసీల్దార్లు సంతోష్‌కిరణ్, బి. పాల్‌సింగ్, తహసీల్దార్ జమీరుద్దీన్ తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదు కాని వారు, ఓటరు జాబితాలో పేరు లేనివారు, చిరునామా మార్చుకునే వారు ఈ రెండు రోజుల్లో నిర్వహించే శిబిరంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫారం-6 ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు.

తిరుమలగిరి(సాగర్): మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌కు చెందిన కోమళ్ల ధనుష్, పానుగోతు నాగరాజు అనే విద్యార్థులు జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెడ్‌మాస్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జనగాం జిల్లాలోని ధర్మకంచలో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించిన ఎస్‌జీఎఫ్ తెలంగాణ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ధనుష్, నాగరాజు సత్తా చాటారని కొనియాడారు. వారు ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు జార్ఖండ్‌లో నిర్వహించే జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

దామరచర్ల: మండలంలోని కొత్తపేటతండాలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువులకు గోపాలమిత్ర ఉచిత గర్భకోశ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి స్వప్న మాట్లాడుతూ వైద్య శిబిరంలో 46 గేదెలకు గర్భకోశ సంబంధిత సమస్యలు ఉన్నట్లు గుర్తించి వాటికి నివారణ వైద్యం అందించినట్లు తెలిపారు. పశు వైద్య శిబిరాన్ని డీఎల్‌డీఏ ఈవో పాశం శ్రీనివాస్‌రెడ్డి సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ శాంతిప్రకాశ్, జ్యోతినాగుపాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని శ్రీ చేతన పాఠశాలలో శుక్రవారం యోగి వేమన జయంతిని నిర్వహించారు. యోగిగా మారిన వేమన జీవిత చరిత్రను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. వేమన పద్యాలను విద్యార్థులతో పాడించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పుచ్చకాయల వెంకట్‌రెడ్డి, డైరెక్టర్లు సునీత, ఉపాధ్యాయులు రాఘవేంద్ర, మనోహర, శ్రీనివాస్, సురేష్, వెంకట్, జాస్మిన్ పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని గౌతమి స్కూల్, రెయిన్‌బో, కృష్ణవేణి, సాయి సిద్ధార్థ, బధిరల పాఠశాలల్లో త్రైత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు వేమన పద్యాలపై అవగాహన కల్పించారు. వేమన జయంతిని పురస్కరించుకొని ఆయన పద్యాలపై అవగాహన కల్పించినట్లు వారు తెలిపారు.

దేవరకొండ: ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా సహాయకార్యదర్శి బొడ్డుపల్లి శేఖర్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వలమాల అంజనేయులు, ముదిగొండ మురళికృష్ణ అన్నారు. శుక్రవారం దేవరకొండలో శేఖర్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన స్మారక స్తూపం వద్ద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. విద్యార్థుల హక్కులు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం బొడ్డుపల్లి శేఖర్ పోరాటాలు చేశాడని గుర్తుచేశారు.

దేవరకొండ: లయన్స్‌క్లబ్ మిత్ర పేదలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని లయన్స్ క్లబ్ జోనల్ అధ్యక్షుడు గాజుల రాజేష్ అన్నారు. దేవరకొండలో లయన్స్‌క్లబ్ మిత్ర ఆధ్వర్యంలో భిక్షాటన చేస్తు జీవిస్తున్న 20 మంది వృద్ధులకు శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్, లయన్స్ క్లబ్ మిత్ర నాయకులు ఏలే యాదయ్య, జయలక్ష్మి, జల్లా దశరథ, చంద్రమౌళి, కృష్ణమాచారి, మహేష్ పాల్గొన్నారు.

చింతపల్లి: రేషన్‌డీలర్లు సమయపాలన పాటించాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎండి.అబీబ్ అన్నారు. మండల కేంద్రంలోని 32వ రేషన్ దుకాణాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేసి సోషల్ ఆడిట్ నిర్వహించారు. వినియోగదారులతో మాట్లాడారు. రేషన్‌షాపు నిర్వహణతో పాటు సరుకులు సక్రమంగా ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రేషన్ షాపు యజమాని కొకొండ్ల నారాయణ, వినియోగదారులు ఉన్నారు.

మిర్యాలగూడ టౌన్: మానవ సేవే మాధవ సేవ అని ఫెయిత్ బంజారా ఆశ్రమ నిర్వాహకులు హన్యానాయక్ అన్నారు. పట్టణంలోని సిక్కుల కాలనీలో శుక్రవారం దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరాశ్రయులు, ప్రత్యేక అవసరాలు గల వారికి సేవ చేస్తే భగవంతుని మెప్పు పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో రమాభాయి, సుధారాణి, అర్జున్‌సింగ్, అవతార్, రేణుక, లక్ష్మి పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: అయోధ్యలో శ్రీ సీతారాముల ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 22వ తేదీన కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రమౌళీశ్వర, హరిహర పుత్ర అయ్యప్ప స్వాముల దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు నాయిని మాధవరెడ్డి తెలిపారు. ఈ పూజా కార్యక్రమానికి ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

దేవరకొండ: దేవరకొండ డివిజన్ మాదిగ ఉద్యోగుల సంఘం సమాఖ్య డివిజన్ అధ్యక్షుడిగా పులకంటి బాస్కర్, ప్రధాన కార్యదర్శిగా రావుల బాలరాజును శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో మాదిగ ఉద్యోగుల పెడరేషన్ రాష్ట్ర సహాయకార్యదర్శి వస్కుల సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం కాలయాపన చేయకుండా ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలన్నారు.

కట్టంగూరు: కట్టంగూరుకు చెందిన దోరేపల్లి మల్లికార్జున్ అనే డ్రైవర్ రోడ్డు ప్రమాదంలో గాయపడి అనారోగ్యంతో మంచం పట్టారు. కుటుంబ పోషణభారంగా మారింది. విషయం తెలుసుకున్న సమిష్టి సేవా ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం 25 కేజీల బియ్యం, 14 రకాల వంట సరుకులను అందజేశారు. దీంతో పాటు కలిమెర గ్రామానికి చెందిన వేములకొండ సోమయ్య పుట్టుకతో అంధుడు కావడంతో ఆయన కుటుంబానికి సమిష్టి సేవా ఫౌండేషన్ 25 కేజీల బియ్యం, 14 రకాల వంట సరుకులను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఫౌండేషన్ సభ్యులు గోగు బాలసైదులు, గట్టిగొర్ల యాదగిరి, దాసరి ప్రవీణ్, గుండు ఉపేందర్, ఇమ్రాన్, నరేష్, నర్సింహ, యాదయ్య, మారయ్య పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లిలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జిల్లా కోర్టు అటెండర్ చిక్కుళ్ల రమేష్‌కు అదనపు మరియు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి తిరుపతి నివాళులర్పించారు.